చెత్త సేకరణలో నిర్లక్ష్యం

పేరుకుపోతున్న చెత్త

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో స్వచ్ఛ ఆటోల నిర్వాహకులు చెత్త తొలగింపులో జాప్యం ప్రదర్శిస్తున్నారు. శానిటేషన్ అధికారులకు ఫిర్యాదు చేస్తే కొద్ది రోజుల పాటు చెత్త తొలగిస్తూ మళ్లీ నాలుగైదు రోజుల వరకు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని శిల్పా గార్డెన్స్, వుడ్ ల్యాండ్ కాలనీ, వెంకటేశ్వర కాలనీలలో స్వచ్ఛ ఆటోలు నిత్యం చెత్త సేకరణ చేయడం లేదు. మూడు నాలుగు రోజులకు ఒకసారి వస్తుండడంతో అపార్ట్‌మెంట్లలో చెత్త పేరుకుపోతోంది. దీంతో దుర్వాసన వెదజల్లడంతో కాలనీవాసులు ఇబ్బందిపడుతున్నారు. సంబంధిత అధికారులు నిత్యం చెత్త సేకరణ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పెంచిన బస్ పాస్ ధరలను తగ్గించాలి

శేరిలింగంపల్లి: ప్రభుత్వం పెంచిన ఆర్టీసీ బస్ పాస్ ధరలను వెంటనే తగ్గించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు నీరటి చంద్రమోహన్ మంగళవారం డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయలేక, ప్రజలపై అదనపు భారాన్ని మోపితే బీజేపీ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని హెచ్చరించారు. బస్ పాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

స్కూల్ బస్ డ్రైవర్లకు డ్రంకెన్‌డ్రైవ్ టెస్ట్ తప్పనిసరి

ట్రాఫిక్ సీఐ లాలూనాయక్

పటాన్‌చెరు టౌన్: విద్యాసంస్థల నుండి బస్సును బయటకు తీసే క్రమంలో బస్సు డ్రైవర్‌కు డ్రంకెన్‌డ్రైవ్ టెస్ట్ తప్పనిసరిగా నిర్వహించాలని ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ అన్నారు. మంగళవారం పటాన్‌చెరు పరిధిలో ట్రాఫిక్ పోలీసులు విద్యాసంస్థల బస్ డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లు నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ లాలూ నాయక్ మాట్లాడుతూ... విద్యాసంస్థల బస్సులు నడిపే డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడిపితే డ్రైవర్‌తో పాటు విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీల్లో ఎస్ఐలు ఆంజనేయులు ,పవన్, సిబ్బంది పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలోని పదో బ్లాక్‌లో నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ పనులను మంగళవారం కార్పొరేటర్ పుష్ప పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రైనేజీ పైపులైన్ పనులను ప్రజలకు ఇబ్బంది లేకుండా త్వరగా పూర్తి చేయాలని కోరారు. అనంతరం సీసీ రోడ్డును అభివృద్ధి చేస్తామని తెలిపారు.

ఎఫ్‌సీసీహెచ్‌ఎస్ లేఅవుట్‌లో రోడ్లకు మార్కింగ్

సర్వే చేపట్టిన హైడ్రా అధికారులు



గచ్చిబౌలి: ఫర్టిలైజర్స్ కార్పొరేషన్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లేఅవుట్‌లో రోడ్లకు హైడ్రా అధికారులు మార్కింగ్ చేశారు. రోడ్లను ఆక్రమించి ప్లాట్లు కనిపించకుండా లేఅవుట్ స్వరూపాన్ని మార్చారని ఫర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలోని ప్లాట్ల యజమానులు హైడ్రాకు ఫిర్యాదులు చేసిన క్రమంలో.. తాజాగా లేఅవుట్‌లో ఉన్న రోడ్లను గుర్తించేందుకు మంగళవారం హైడ్రా అధికారులు భారీ పోలీసు బందోబస్తు మధ్య సర్వే చేశారు. అనంతరం లేఅవుట్‌లోని రోడ్లను గుర్తించి జేసీబీలతో మార్కింగ్ చేశారు.

- గచ్చిబౌలి సర్వే నెంబర్ 124,125లో దాదాపు 20 ఎకరాల విస్తీర్ణంలో ఫర్టిలైజర్స్ కార్పొరేషన్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ పేరిట లేఅవుట్ చేశారు. దాదాపు 162 ప్లాట్లను యజమానులు సంధ్యా కన్వెన్షన్ ఎండి శ్రీధర్ రావుకు అమ్ముకున్నారు. మిగిలిన ప్లాట్లకు హద్దులు, రోడ్లు లేకపోవడంతో మిగిలిన వారు హైడ్రాను ఆశ్రయించారు. లేఅవుట్‌లో ఉన్న రోడ్లను పూర్తి స్థాయిలో మార్కింగ్ చేస్తామని అధికారులు వెల్లడించారు. హైడ్రా ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, తహసీల్దార్ సత్యబాబు, ఏడీ సర్వేయర్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణహాని ఉంది: నటి రమ్యశ్రీ

శ్రీధర్‌రావు అనుచరులు తన సోదరుడు ప్రశాంత్‌పై దాడికి పాల్పడ్డారని నటి రమ్యశ్రీ ఆరోపించారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ వద్ద కారు వద్దకు వెళుతుండగా దాడి చేశారని అతని వల్ల తనకు ప్రాణహాని ఉందన్నారు. ఇప్పటికే ప్రధానమంత్రికి లేఖ రాశానని రమ్యశ్రీ తెలిపారు. ఎంతోమందికి ఇప్పటికీ ప్లాట్లు ఎక్కడున్నాయో తెలియక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. కాగా గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్ మాట్లాడుతూ దాడి జరిగిందని ఫిర్యాదు చేశారని, పరిశీలించి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చందానగర్: హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దీప్తి పేర్కొన్నారు.

- ఆదిత్య ఇంపీరియల్ హైట్స్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.00 నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు ఆదిత్య ఇంపీరియల్ హైట్స్ అపార్ట్‌మెంట్స్, వినాయకనగర్, ప్రకాష్‌నగర్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.
- ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ, సప్తగిరి కాలనీ, మైత్రీనగర్ ప్రాంతాలలో..

హఫీజ్‌పేట్ సెక్షన్ పరిధిలో...

- మాతృశ్రీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో.. 11 కేవీ ఫీడర్ల పరిధిలో..
- నందినీనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.00 నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు మియాపూర్ మెయిన్‌రోడ్డు, సాయిరంగ థియేటర్, రాజారాం కాలనీ, అంబేద్కర్‌నగర్ కొంత భాగం ఏరియాలలో..
- శ్రీలీల ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు శ్రీలీల పార్కు, ఎస్ఎంఆర్, వాటర్ వర్క్స్, కల్వరి టెంపుల్ ప్రాంతాలలో..

తారానగర్ సెక్షన్ పరిధిలో..

- హుడా కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో
- చందానగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.00 నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు చందానగర్ మెయిన్‌రోడ్డు, పూర్ణిమ అపార్ట్‌మెంట్, వెంకటేశ్వరస్వామి టెంపుల్ ఏరియాలలో..
- తారానగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు వెంకట్‌రెడ్డి కాలనీ, పోచమ్మ టెంపుల్ వెనకాల, వెంకట్రాది నగర్, పీజేఆర్ స్టేడియం ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కొండాపూర్‌లో..

గచ్చిబౌలి: ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వసంతసిటీ, సైబర్ విలేజ్, సైబర్ వ్యాలీ, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాతా భవనేశ్వరీనగర్ తదితర ప్రాంతాలలో ..

- గచ్చిబౌలిలో.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జీసీఆర్‌పి క్వార్టర్స్, యూకో బ్యాంక్ లేన్, గ్రీన్ ల్యాండ్ కాలనీ, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వినాయక్‌నగర్, కేంద్రీయ విహార్, వెంకటేశ్వరస్వామి టెంపుల్ తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదు.

శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

శేరిలింగంపల్లి: నగర పరిశుభ్రత-మన అందరి బాధ్యత అని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ తెలిపారు. శేరిలింగంపల్లి గోపీనగర్‌లో మంగళవారం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించడానికే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయకుండా స్వచ్ఛ ఆటోలకు అందజేయాలని కోరారు. నాయకులు రాజు యాదవ్, రవీందర్ గౌడ్, యాదాగౌడ్, నర్సింహగౌడ్, గోపాల్‌యాదవ్, రాజ్‌కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీకాంత్, నర్సింహ, ఎస్ఆర్‌పీ బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ తదితరులు

'సెలబ్రేటింగ్ ది సూపర్ హీరోస్'

మాదాపూర్: క్యాన్సర్‌ను జయించిన వారితో జూన్ నెలను క్యాన్సర్ సర్వైవర్స్ మంత్‌గా మంగళవారం మెడికవర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ ఓ కార్యక్రమాన్ని నిర్వహించారు. సెలబ్రేటింగ్ ది సూపర్ హీరోస్ అనే థీమ్‌తో జరిగిన కార్యక్రమంలో క్యాన్సర్ విజేతలు, వారి సంరక్షకులు, వైద్యనిపుణులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ మిసెస్ ఇండియా తెలంగాణ క్రౌన్ విజేత మిథాలి అగర్వాల్, క్యాన్సర్ ఫైటర్ గృహిణి సుమంతి చూరకంటి పాల్గొని వారి అనుభవాలను తెలిపారు. కార్యక్రమంలో పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు బాలికలు అదృశ్యం



ఆయేషా (ఫైల్)

మియాపూర్: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు బాలికలు అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...లింగంపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో తిరుగుతున్న బాలిక అయేషా(7)ను రైల్వే పోలీసులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధికారులు ఈ నెల 13వ తేదీన సాయంత్రం 4.30 గంటలకు మియాపూర్‌లో ఉన్న వివేకానంద సేవా సంఘం వృద్ధ, అనాధాశ్రమంలో చేర్పించారు. ఈ క్రమంలో అయేషా జూన్ 15 సాయంత్రం నుంచి కనిపించడం లేదు. ఆశ్రమ నిర్వాహకులు చుట్టుపక్కల వెతికినా అయేషా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆశ్రమ నిర్వాహకులు మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామని తెలిపారు.

మరో ఘటనలో....



హాసిని (ఫైల్)

మైనర్ బాలిక ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లి పోయింది. మియాపూర్ ఎస్ఐ రాజేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ న్యూ హఫీజ్‌పేట ప్రేమ్‌నగర్ కాలనీలో నివాసముంటున్న బంధు ప్రకాష్, సావిత్రి దంపతుల కుమార్తె బంధు హాసిని(16) పదో తరగతి వరకు చదువుకుంది. కాగా 16వ తేదీ సాయంత్రం హాసిని ఇంట్లో ఎవరికి చెప్పాపెట్టకుండా బయటకు వెళ్లింది. రాత్రి అయినా తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల వద్ద విచారించినా ఆచూకీ లభ్యం కాలేదు. కూతురు కనిపించడం లేదని తల్లి సావిత్రి ఫిర్యాదు చేసింది. బాలికను గుర్తించిన వారు మియాపూర్ పోలీస్ స్టేషన్ 9490617129కు సమాచారం అందించాలని తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతి



చందానగర్: గుర్తు తెలియని యాచకురాలు మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సంధ్య తెలిపిన ప్రకారం.. లింగంపల్లి ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ సమీపంలో వృద్ధురాలు (65) కింద పడిపోయి ఉంది. ఈ విషయాన్ని చందానగర్ పోలీసులకు తెలియజేయడంతో ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా అప్పటికే ఆమె మృతి చెందింది. ఈ మేరకు చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

మెరిట్ ఆధారిత కోర్సుల అడ్మిషన్లకు 19 ఆఖరు

'మనూ' అడ్మిషన్ల డైరెక్టరేట్ డైరెక్టర్ ప్రొ. వనజ

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వ విద్యాలయంలోని రెగ్యులర్ కోర్సులలో మెరిట్ ఆధారంగా అడ్మిషన్లు కల్పించే కోర్సుల దరఖాస్తుకు చివరి తేదీని జూన్ 19గా నిర్ణయించామని 'మనూ 'అడ్మిషన్ల డైరెక్టరేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం వనజ మంగళవారం వెల్లడించారు. 2025-26 విద్యాసంవత్సరానికి 'మనూ' హైదరాబాద్‌లోని ప్రధాన క్యాంపస్‌లో, దేశవ్యాప్తంగా ఉన్న శాటిలైట్ క్యాంపస్‌లలో ఈ అడ్మిషన్లు జరుగుతాయన్నారు. ఈ దరఖాస్తులను ఆన్‌లైన్‌లోనే చేయాలని ఆమె సూచించారు. ప్రాస్పెక్టస్‌ను యూనివర్సిటీ పోర్టల్‌లో యాక్సెస్ చేయవచ్చన్నారు.మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ అడ్మిషన్ హెల్ప్ డెస్క్ 040-23006612 ఎక్స్‌టెన్షన్ 1801లో సంప్రదించాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్

మియాపూర్: అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీలో ఆ పార్టీ నాయకులు, స్థానికులతో కలిసి సమస్యలను పరిశీలించారు. కాలనీలో చెరువు సుందరీకరణ పేరుతో చెరువులో ఉన్న మురుగునీటినంతా కాలనీ రోడ్లపై వదిలేయడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జలమండలి అధికారులను సంప్రదించి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కాలనీ, బస్తీలలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని లేకపోతే జోనల్ కార్యాలయంను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు నర్సింహరాజు, పార్టీ నియోజకవర్గ కన్వీనర్ రాఘవేందర్‌రావు, సీనియర్ నాయకులు నాగులుగౌడ్, మాణిక్‌రావు, గణేష్, జితేందర్, శ్రీనివాస్, శివరాజు, శివారెడ్డి పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని శంషీగూడలో 22 లక్షల రూపాయల నిధులతో నిర్మిస్తున్న నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ మంగళవారం జీహెచ్‌యంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. రోడ్డుపై వర్షపు నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రాజేందర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, కాలనీవాసులు పాల్గొన్నారు.